గణపయ్యకు భారీ వ్యయమే..!

◆ రూ.50 కోట్ల వరకు ఖర్చు ◆ 'అనంత'లో ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భారీ కాయుడు... బొజ్జ గణపయ్యకు జనం భారీగానే ఖర్చు పెట్టారు. అనంతపురం జిల్లాలో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరిగాయి. సాధారణంగా జిల్లాలో మూడు, ఐదు రోజుల పాటు జరుపుతారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు రోజులకే నిమజ్జనాలు పూర్తయ్యే విధంగా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అనంతపురం నగరం, ఇతర పట్టణాల్లో ఐదు రోజులకు అనుమతులిచ్చారు. ఐదు రోజులు పెట్టినవి శుక్రవారం నాడు నిమజ్జనం జరిగాయి. జిల్లా వ్యాప్తంగా అనుమతి తీసుకున్న వరకు ఐదు వేల వరకు విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఒక్క అనంతపురం నగరంలోనే అధికారికంగా 446 వరకు ఉండగా మరో రెండు వందల వరకు అనుమతి లేకుండా ఉన్నాయి. ఇవి కూడా ఐదవ రోజే నిమజ్జనం జరిగాయి. ఎక్కడా ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవడంతో ప్రశాంతంగా నిమజ్జనం జరిగింది.

భారీ వ్యయమే..

భారీ కాయుడి గణపయ్యకు జనం పెట్టిన ఖర్చు కూడా అధికంగానే పెట్టారు. జిల్లా వ్యాప్తంగా 3300 విగ్రహాలు జిల్లాలో ఏర్పాటయ్యాయి. ఒక్కో చోట లక్ష నుంచి పది లక్షలకు పైగా ఖర్చు అయ్యింది. తక్కువ అన్న ఒక్కో విగ్రహం ఏర్పాటు, ఇతర ఖర్చులు అన్నీ కలిపి సగటున లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు అయ్యింది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా ఈ ఐదు రోజుల విగ్రహాల

అనంతపురంలో వినాయక నిమజ్జనం

ఏర్పాటుకు అయిన ఖర్చు సుమారు రూ,50 కోట్లకుపై పైమాటేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విగ్రహాల ఏర్పాటు వెనుక వి'నాయకులు'

వచ్చేది ఎన్నికల సంవత్సరం కావడంతో పెద్దఎత్తున విగ్రహాల ఏర్పాటు జరిగింది. సందు,సందుల్లోనూ విగ్రహ మంటపాలు వెలిశాయి. ఇంత పెద్ద ఎత్తున జరిగిన ఖర్చు వెనుక నాయకులున్నారన్న ప్రచారం సాగుతోంది. ఆయా ప్రాంతాల్లో యువకులను బృందాలుగా ఏర్పాటు చేసి విగ్రహాలు ఏర్పాటు చేసే విధంగా ముందస్తు ప్రణాళిక చేశారు. దీనికి కొంత వరకు ఆర్థికపరమైన తోడ్పాటును అందించారు. దీంతో గడిచిన రెండేళ్ల కంటే ఎక్కువగానే ఈసారి విగ్రహాల ఏర్పాటు జరిగింది.

డీజేల ముందు హోరెత్తిన యువత

విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్రతి విగ్రహం వద్ద డీజేల సౌండ్లు దద్దరల్లాయి. ఇందులో ప్రధానంగా యువత సందడి అంతఇంతా కాదు. గతానికి భిన్నంగా పెద్దఎత్తున యువతులు కూడా పాల్గొని నృత్యాలు చేయడం గమనార్హం. అనంతపురం సాయంత్రం నుంచి రాత్రి ఒంటి గంట వరకు విగ్రహాల నిమజ్జన యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా అనంతపురం నగరంలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను సైతం పోలీసులు మళ్లించారు.

'మద్యం' ఓపెన్

వినాయక నిమజ్జనం రోజు ఉదయం నుంచే మద్యం విక్రయాలు నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. గతంలోనూ చేసేవారు. కాని ఈసారి విక్రయాలు నిలిపివేయలేదు. ఉదయం నుంచి రాత్రి వరకు యథావిధిగా మద్యం విక్రయాలు జరిగాయి. వినాయక చవితి వేడుకల్లో పాల్గొనే యువత ఒకవైపు మందు... మరోవైపు డీజేల ముందు చిందులు వేశారు.

డిఎల్ఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

సమన్వయంతో ముందుకెళ్తే ఫలితాలు

కేటాయించిన లక్ష్యాలను బ్యాంకర్లు చేరుకోవాలి - కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్తే అనుకున్న లక్ష్యాలను సాధించడంలో సత్ఫలితాలు వస్తాయని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జిల్లా స్థాయి రివ్యూ కమిటీ (డిఎల్ఆర్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లతో పరిశ్రమలు, వ్యవసాయం, డీఆర్డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఆయా పథకాల కింద కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించి రుణాలు విరివిగా మంజూరు చేయాలన్నారు. స్టాండప్ ఇండియా, జగనన్న బడుగు వికాసం కింద విరివిగా ప్రచారం కల్పించాలని చెప్పారు. ప్రధానమంత్రి ముద్ర యోజన కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో జూన్ నెలాఖరు వరకు 17,821 మంది అకౌంట్‌దారులకు 233.98 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేయగా, మరింత మంది లబ్ధిదారులకు రుణాలు అందించేలా చూడాలన్నారు. విద్యా, పంట రుణాలు రుణాలు ఇచ్చేలా చూడాలన్నారు. పీఎం సురక్ష బీమా యోజన కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు బీమా వర్తింపజేయాలన్నారు. పశువుల యూనిట్లను స్థాపించడంలో పెద్ద సంఖ్యలో రైతులను ప్రోత్సహించడానికి బ్యాంకర్లు విరివిగా ఆర్థిక సహాయం చేయాలని సూచించారు. అర్హులైన చేనేతలకు రుణాలు ఇవ్వాలన్నారు. అన్ని స్థాయిల్లోనూ లక్ష్యం మేరకు రుణాలను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్డీఎం ఎస్.అనిల్ కుమార్, ఎల్డీఎం సత్యరాజ్, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ డిడి రఘునాథరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, ఫిషరీష్ డిడి శాంతి వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

బంగారుతల్లీ లేవమ్మా..

ఒక్కగానొక్క కూతురు... ఎంతో అల్లారు ముద్దుగా చూసుకున్నారు. తమ సర్వస్వం కూతురే అని భావించారు. వినాయక చవితి ఉత్సవాలు పైగా తమ ముద్దుల కమార్తె పుట్టినరోజు ఒకేసారి రావడంతో ఆ తల్లిదండ్రులు పట్టలేని ఆనందంతో వేడుక జరిపేందుకు సిద్ధం అయ్యారు. ఉదయాన్నే 'పుట్టిన రోజు శుభాకాంక్షలు చిట్టి తల్లి' అని నిద్రలేపారు. కొత్తబట్టలు వేసి మహాలక్ష్మిలా అలంకరించారు. బుడిబుడి అడుగులేస్తూ ఆ చిన్నారి కాలనీలోని వారికి చాక్లెట్లను అందించింది. చిన్నారి మోములో చిరునవ్వును చూసి తల్లిదండ్రులే కాదు.. కాలనీవాసులూ మురిసిపోయారు. అయితే ఈ ఆనందం గంటల వ్యవధిలోనే ఆవిరయ్యింది. పాఠశాలలో స్నేహితులకు చాక్లెట్లు ఇచ్చేందుకు వెళ్లిన చిన్నారికి అదే చివరి రోజు అయ్యింది. తరగతి గదికి ఏర్పాటు చేసిన బండ విరిగి మీద పడడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. చిరునవ్వుతో ఇంటి నుంచి వెళ్లిన కూతురు మృత్యుఒడికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అయ్యారు. విగతజీవిగా పడిఉన్న కూతుర్ని చూసిన కన్నపేగు తల్లడిల్లిపోయింది. గుంతకల్లులో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

కీర్తన (ఫైల్ ఫొటో)

◆ పాఠశాలలో బండ విరిగిపడి చిన్నారి మృతి
◆ పుట్టినరోజే చివరిరోజు..
◆ తల్లడిల్లిన కన్నపేగు
◆ ప్రయివేటు పాఠశాల యాజమాన్యంపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆగ్రహం
◆ గుంతకల్లులో పెను విషాద ఘటన

ప్రజాశక్తి గుంతకల్లు

గుంతకల్లు పట్టణం పాతగుంతకల్లుకు చెందిన బోయ రంగయ్య, శిరీషాలు దంపతులు. రంగయ్య ప్రయివేటు ఉద్యోగికాగ, శిరీష వార్డు వాలంటీర్‌గా పని చేస్తున్నారు. వీరికి ఒక్కగానొక్క కుమార్తె కీర్తన(4) ఉంది. ఈ చిన్నారి పట్టణంలోని శ్రీవిద్య ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఎల్‌కెజీ చదువుతోంది. శుక్రవారం చిన్నారి పుట్టిన రోజుకావడంతో తల్లిదండ్రులు కూతురుకు కొత్తబట్టలు వేసి అందంగా ముస్తాబు చేశారు. పుట్టినరోజు నాడు స్నేహితులకు చాక్లెట్లు ఇచ్చేందుకు కూతుర్ని పాఠశాలకు తీసుకెళ్లారు. సాయంత్రం 3గంటల సమయంలో తరగతి గదికి ఏర్పాటు చేసిన బండ విరిగిచిన్నారిపై పడింది. తలపై పడడంతో చిన్నారి ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మరణించింది.

కన్నీటి పర్యవంతం అవుతున్న కీర్తన తల్లిదండ్రులు

పాఠశాలక వెళ్లకున్నా బతికుండే దానివే...

'చాక్లెట్లు ఇచ్చి వస్తానని పాఠశాలలకు వెళ్లావమ్మా కదమా.. ఇంతలోని ఇంత ఘోరం జరిగిందా.. పాఠశాలకు వెళ్లకున్నా బతికుండేదానివి కదమ్మా.. బంగారు తల్లీ ఒక్కసారి లేవమ్మా'.. అంటూ చిన్నారి కీర్తన తల్లిదండ్రులు గుండెలు అవిసేలా రోదించారు. కుమార్తె మృతి వార్త తెలియగానే తల్లిదండ్రులు హుటాహుటిన పాఠశాల వద్దకెళ్లారు. విఘతజీవిగా పడిఉన్న కుమార్తెను చూసి కన్నీటి పర్యవంతం అయ్యారు. కీర్తనా లేవమ్మా అంటూ వారు రోధించిన తీరు అక్కడున్న వారినందరినీ కంటతడి పెట్టించింది.

బండల షెడ్లతో పాఠశాల..!

చిన్నారి మృతికి కారణమైన పాఠశాలను పరిశీలిస్తే అక్కడ ఎలాంటి రక్షణ సదుపాయాలు లేవని ఇట్టే అర్థం అవుతుంది. బండరాళ్లపై రేకుల షెడ్డును వేసి పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇలా రక్షణ లేకుండా ఏర్పాటు చేసిన గదుల్లో పాఠాలు చెప్పేందుకు విద్యాధికారులు అనుమతులు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వేలాది రూపాయలు ఫీజులు రూపంలో తీసుకునే పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల రక్షణను గాలికొదిలేస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూతుర్ని పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రులకు ఎవరు న్యాయం చేస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

గుంతకల్లు పట్టణంలో బండల షెడ్లతో నిర్వహించే ప్రయివేటు పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం నాడు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. గుంతకల్లు పట్టణంలో గుర్తింపు లేని పాఠశాలలు నిర్వహిస్తున్నప్పటికీ స్థానిక ఎంఇఒ, జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటు పాఠశాలలపై విద్యాధికారులు పర్యవేక్షణ లేకపోవడం వల్లనే గుంతకల్లులో శ్రీవిద్య ఇంగ్లీషుమీడియం పాఠశాలలో నాలుగేళ్ల చిన్నారి కీర్తన మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న వారి వద్దకు పోలీసులు వచ్చి చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసి, బాధ్యులపై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళన విరమించమని నాయకులు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు విద్యార్థి సంఘం నాయకులను బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

గుంతకల్లు మరో విషాదం

నీటి కుంటలో పడి చిన్నారి మృతి

పెళ్లై ఎన్ని సంవత్సరాలు అయినా పిల్లలు లేకపోవడంతో ఆ దంపతులు ఎన్నో పూజలు చేశారు. గుళ్ళు తిరిగారు. ఆరుసార్లు గర్భం దాల్చినా అబార్షన్ కావడంతో సంతానం కోసం అనేక మంది వైద్యులను సంప్రదించారు. ఏళ్ల తరబడి నిరీక్షించిన వారి కలనెరవేరింది. పండంటి కూతురు వారికి జన్మించింది. అయితే ఈ సంతోషం మూడేళ్లకే ఆవిరయ్యింది. ముద్దులొలికే వారి కూతురు నీటికుంటలో పడి మరణించింది. ఈ ఘటనతో ఆ కుటుంబంలో చీకట్లు నిండాయి. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకుంటున్న కూతురు మరణించడంతో ఆ తల్లిదండ్రులు శోకసంద్రంలో నిండిపోయారు.

మృతి చెందిన చిన్నారి అశ్విని

గుంతకల్లు పట్టణంలోని మస్తాన్‌పేటకు చెందిన పెద్దయ్య, భారతిలు భార్యాభర్తలు. వీరికి 15 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. 15 ఏళ్లు అయినా వీరికి పిల్లలు లేకపోవడంతో చాలా మంది వైద్యులను సంప్రదించారు. మూడేళ్ల క్రితం వీరికి ఆడబిడ్డ జన్మించింది. అశ్విని(3) అని పేరు పెట్టి చిన్నారిని కంటికి రెప్పలా చూసుకున్నారు. తమ సర్వసం కూతురే అంటూ వీరి ఆనందాన్ని ఆచిట్టి తల్లిలో చూసుకునేవారు. ఇలాంటి వీరి జీవితంలో పెను విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారి అశ్విని అనుకోకుండా నీటిసంపులో పడింది. దీనిని ఎవరూ గుర్తించకపోవడంతో చిన్నారి ఊపిరాడక మరణించింది. చిన్నారి కన్పించకపోవడంతో తల్లిదండ్రులు వెతగ్గా సంపులో కన్పించింది. బయటకు తీసి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు చిన్నారిని ఎత్తుకుని గుండలు అవిసేలా రోధించారు. వారి ఆర్తనాదాలు అక్కడున్న వారిచేత కంటతడి పెట్టించాయి. ఈ ఘటనపై 1వ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడువులోగా 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యతగా గడువులోపు పరిష్కారం చూపించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కనకదాస్ కళ్యాణ మండపంలో నిర్వహించిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివారం బుధవారం, శుక్రవారాల్లో మండల స్థాయి జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి 46 అర్జీలను స్వీకరించారు. కాగా పేదరికంలో మగ్గుతున్న రెడ్లను అదుకోవాలని ఎపి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జెసికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భూమిలేని వారికి భూమి, ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అంతకుముందు ఆత్మకూరులో నిర్వహించిన కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొని పారిశుధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు కూడా పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పలువురు పారిశుధ్య కార్మికులను సన్మానించారు. తర్వాత సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ క్యాంపెయిన్‌ని పరిశీలించారు. అక్కడి నుంచి మండల కేంద్రంలోని పంపనూరు వద్ద ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలవలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, వెంకటేశ్వర్లు, డీపీఓ ప్రభాకర్‌రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఇహషాన్‌బాషా, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

యశ్వంత్‌పూర్-కారటిగి ఎక్స్‌ప్రెస్ రైలు మళ్లింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

యశ్వంత్‌పూర్ నుంచి కారటిగి మధ్య ప్రయాణించే 16545/16546 డెయిలీ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 24 నుంచి అక్టోబర్ 25వ తేదీ వరకూ బళ్లారి జంక్షన్ స్టేషన్‌లో ఆగదని నైరుతీ రైల్వే హుబ్బల్లి డివిజన్ ముఖ్య సమాచార అధికారి అనీష్ హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ అభివృద్ధి పథకంలో భాగంగా బళ్లారి రైల్వేస్టేషన్‌లో మూడో నెంబర్ ప్లాట్‌ఫారంలో అభివృద్ధి పనులు చేస్తున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ రైలు బళ్లారి స్టేషన్‌లో కాకుండా ఓబులాపురం, బళ్లారి బైపాస్ క్యాబిన్, బళ్లారి కంటోన్మెంట్, కుడితిని మీదుగా ప్రయాణిస్తుందన్నారు. బళ్లారి ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైలు బళ్లారి కంటోన్మెంట్ స్టేషన్‌లో ఐదు నిమిషాల పాటు ఆగుతుందన్నారు. బళ్లారి ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని కోరారు.

ఒపిఎస్‌ను అమలు చేయాలి

గాంధీ విగ్రహానికి ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఓపిఎస్‌ను అమలు చేయాలన్నారు. ంంంంసిపిఎస్‌ను అమలు చేయడం ద్వారా ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి జాఫర్, హీరాలప్ప, సరోజమ్మ, శ్రీనాథ్, హనుమంతప్ప, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల కట్టడితోనే మాతా శిశుమరణాలు తగ్గుదల

స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

బాల్యవివాహాలను కట్టడి చేయడం ద్వారానే మాతాశిశుమరణాలను తగ్గించవచ్చని స్త్రీశిశుసంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి సూచించారు. శుక్రవారం స్థానిక జేసీ దివాకర్ కళ్యాణ మండపంలో ఐసిడిఎస్, జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో డివిజినల్ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వివాహాలు చేస్తే రెండేళ్ల పాటు జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించడంతో పాటు తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో మహిళా పోలీసుల సహకారంతో పెళ్లిళ్ల వివరాలను నమోదు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. గుత్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఉన్న వలంటీర్లు తన పరిధిలోని పెళ్లిళ్ల సమాచారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారి పరిధిల్లో బాల్యవివాహాలు జరిగితే వలంటీర్లపై కూడా కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారి సుబ్రమణ్యం, చైల్డ్‌లైన్ ప్రాజెక్టు సమన్వయకర్త కృష్ణమాచారి పవర్పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బాల్యవివాహాలు నిరోధించడానికి కొత్తగా జీవోలు, ఆన్‌లైన్ సేఫ్టీ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా, మత్తుపదార్థాల వినియోగం, బాలల భవిష్యత్తు, జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ప్రాజెక్టు సిడిపిఒ షాజిదాబేగం, యాడికి, పెద్దవడుగూరు, పామిడి, గుత్తి మండలాల తహశీల్దార్లు అలెగ్జాండర్, నాగభూషణ, ఎంపిడిఒలు లక్ష్మీనారాయణ, కుళాయిస్వామి, శశికళ, శివాజిరెడ్డి, ఎఇఒలు కాశప్ప, రాముడు, జయరాం, పామిడి సీఐ రాజశేఖరరెడ్డి, ఎపిఎం ఈశ్వర్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకర్లు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
-: విలేకరులు కావలసిన ప్రాంతం:- -: అనంతపురం జిల్లా :-
రాప్తాడు, కూడేరు, పామిడి, వజ్రకరూర్, ఉరవకొండ రూరల్, కంబదూరు, కళ్యాణదుర్గం రూరల్, అనంతపురం రూరల్, అనంతపురం టౌన్, యల్లనూరు
ఇంటర్వ్యూ : తేది 25-09-2023 సోమవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు : 9490099311, 312, 313
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం, అనంతపురం
D.No:42/2, Near Old VRL Godown, Ballari Road, Ananthapuramu-515001.

టిడిపి, చంద్రబాబు అంతానికి జగన్ కుట్ర

ప్రజాశక్తి-రాయదుర్గం

తెలుగుదేశం పార్టీతోపాటు అధినేత చంద్రబాబును అంతం చేసేందుకు సిఎం జగన్ కుట్ర చేస్తున్నారని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ చేపట్టిన ఆందోళనల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు జైలు నుంచి విడుదల అయ్యేంత వరకూ నిరవధిక నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న తమ నాయకుని రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా అరెస్టు చేసి జైలులో పెట్టిందన్నారు. 14 రోజులుగా జైలులో ఉన్న తమ నాయకునికి ఏమాత్రం కనీస సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. వేలకోట్ల అవినీతి కేసులో జైలుకు వెళ్లడంతోపాటు రాష్ట్రంలో అరాచక పాలన అధికారాన్ని సాగిస్తున్న జగన్‌కు రానున్న రోజుల్లో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. జగన్ తప్పుడు చర్యలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందవద్దన్నారు. చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగరాజు, పురుషోత్తం, జ్యోతి, భారతి, మహబూబ్ బాషా, వెంకటేశులు, కష్ణమూర్తి, ప్రశాంతి, గిరి మల్లప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యులు నాగార్జున, బి.ఎస్.పి రాయదుర్గం తాలూకా అధ్యక్షులు ఉలుగప్ప, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : చంద్రబాబుని తక్షణమే విడుదల చేయాలని కోరుతూ అనంతపురం నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌ఛార్జి గుర్రం నాగభూషణ, మాజీ కార్పొరేటర్ వంకదారు వెంకటకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ, ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వానికి పోయేకాలం దాపురించిందన్నారు. ఆరు నెలలు తరువాత మా ప్రభుత్వం వస్తుందని, తప్పు చేసిన అధికారులందరినీ జైలుకు పంపుతామన్నారు. సాయంత్రం మాజీ కార్పొరేటర్లు, మారుతి కుమార్ గౌడ్, సరి పూటీ రమణ, రాజారావు, విజయ శ్రీ రెడ్డి, దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసమిచ్చి దీక్షలు విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుర్లపల్లి రంగాచారి, పావురాల శేఖర్, కుమార్, ఇమ్రాన్, భాస్కర్, షరీన తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి ఎస్టి సెల్ విభాగం నాయకులు శుక్రవారం ఉరవకొండలో నల్లబ్యాడ్జీలు ధరించి రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాయితీ పరుడైన చంద్రబాబును అక్రమంగా జైలులో పెట్టారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే చంద్రబాబును విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్టి సెల్ నాయకులు కేశవనాయక్, సాకే అనిల్, వీరాంజనేయులు, వసంత, అదిశేషు, రామాంజనేయులు, తులసీదాస్, వీరు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలతోపాటు రౌడీయిజం, ప్రభుత్వ వైఫల్యం ఎత్తిచూపుతున్న చంద్రబాబుపై సీఎం జగన్ కక్షసాధింపు చేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడే రోజుల దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, జిల్లా కార్యదర్శి పిట్టు రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాఘవనాయుడు, తెలుగు యువత చంద్రబాబు, సర్పంచి వెంకటనారాయణమ్మ, మాజీ జడ్పీటీసీ జాఫర్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పిఎల్ లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, బోరు నాగర్జున, పప్పూరు సత్తి, బండ్లపల్లి సాంబ, రామానాయుడు, రమేష్, రామూర్తినాయుడు, సాలెహా, బాలనాగి నరేష్, మాజీ ఎంపీటీసీ వేణు, సర్పంచి వెంకట నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి 'కాలవ' నిరవధిక నిరాహార దీక్ష

రాయదుర్గంలో దీక్షలో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

'జగనన్న సురక్ష' పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని అరకటివేముల సచివాలయం పరిధిలో ఉన్న ఏ.కొండాపురంలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపిడిఓ యోగానందరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా సర్వే పనితీరుపై వాలంటీర్లు, ఎఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

ఆర్థికసాయం అందజేస్తున్న వైసిపి నాయకులు

గుత్తి : పట్టణంలోని పాత సిపిఐ కాలనీలో గురువారం ఆత్మహత్య చేసుకున్న వార్డు వాలంటీర్ రంగనాయకుల మృతదేహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇందులో భాగంగా మృతుని కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించారు. అనంతరం రంగనాయకుల అంత్యక్రియలకు వైసిపి యువనేత, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు మంజునాథరెడ్డి రూ.10వేలు ఆర్థిసాయం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, సచివాలయ కన్వీనర్ ఎం.రంగస్వామి, వై.రామసుబ్బారెడ్డి, కౌన్సిలర్లు ఫారూక్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కరిడికొండలో క్షేత్ర దినోత్సవం

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామంలో శుక్రవారం క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులు సాగు చేసిన వేరుశనగ, ఆముదం, సజ్జ, కంది పంటలను పరిశీలించారు. మంచి దిగుబడికి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ సివి.చంద్రమోహన్‌రెడ్డి, కెసి.నటరాజ్, డాక్టర్ డివి.శ్రీనివాసులు, ఏడిఏ ఎం.వెంకటరాముడు, వీఏఏ అజయ్, రీసెర్చ్ అసిస్టెంట్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.

25, 26న ఆటల పోటీలు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 25వ తేదీ నుంచి రెండు రోజుల పాటు పాఠశాల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి దాదాపు 900 మంది అండర్-14, అండర్-17 క్రీడాకారులు పాల్గొంటారన్నారు. 25న సోమవారం యోగా, షటిల్, బ్యాడ్మింటన్, త్రో బాల్, 26న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా వినాయక నిమజ్జనం

నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

రాయదుర్గం : పట్టణంలో శుక్రవారం వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో అనేక చోట్ల కొలువుతీరిన వినాయక విగ్రహాలను వాహనాలపై ఉంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా ఊరేగించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గుత్తి : మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలోని హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.11.79 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ కె.రాణి, ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.దేవదాసు సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వేల్పుల సోమశేఖరయాదవ్, సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో వంటల పోటీలు

గుత్తి : మండలంలోని జక్కలచెరువు ఆర్ఎస్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల తల్లులు, గర్భిణులకు శుక్రవారం వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పోషన్-మా వేడుకల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు ఇచ్చే సరుకులతో వంటల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగగా చిరు ధాన్యాలు, స్థానికంగా దొరికే ఆకుకూరలు, కూరగాయలు, మునగాకు, బాలమృతంతో రొట్టెలు, లడ్డులు, బిస్కెట్లు, ఇడ్లీలు తయారు చేశారు. తల్లులు వండిన వంటలను రుచి చూసి బాగా వండిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కల్యాణి, ఉపాధ్యాయిని సుప్రియ, అంగన్వాడీ కార్యకర్త రామాంజనమ్మ, శారద, విజయ, గౌరి, జయమ్మ, రాజేశ్వరి, గ్రామసంఘం ప్రతినిధులు మునెమ్మ, సుంకమ్మ, అపర్ణ, వెలుగు సీసీ మీనా, వీఓఏ శ్రీదేవి, ఏఎన్ఎం సుగుణమ్మ, ఆశా కార్యకర్త లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యం

కుందుర్పి : ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యాన్ని తీసుకురావడంలో భాగంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచి మాట్లాడుతూ విద్య, వైద్యంతోనే ప్రజల అభివృద్ధి సాధ్యమని భావించిన సిఎం జగన్ ఆ దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే వైద్యాధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, ఉప సర్పంచి మారుతి, ఎంపిటిసి గంగమ్మ హనుమంతురాయుడు, మాజీ ఎంపిటిసి మంజునాథ, మాజీ జడ్పిటిసి రాజగోపాల్, కేసన్న, ఈరలింగప్ప, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, ఎంఎల్‌హెచ్‌పి.ఓబమ్మ, ఏఎన్ఎం విశ్వేశ్వరి, ఆశావర్కర్లు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలు

కేక్ కోస్తున్న టిడిపి నాయకులు

ఆత్మకూరు : యువ నాయకులు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని చేనేత కమ్యూనిటీ భవనంలో కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ సూర్యనారాయణ, నాయకులు వెంకటనారాయణ, కుళ్లాయప్ప, వడ్డే నాగేంద్ర, బెస్త తిమ్మరాయుడు, బాలానాయక్, పిల్లల ప్రతాప్, అంకే ఆనంద్, కందుల ఓబులపతి, భూమయ్య, రవితేజారెడ్డి, మహేష్, లక్ష్మీనారాయణ, బాబా, వెంకటేష్‌నాయక్, వడ్డే సద్దామప్ప, మైనార్టీ చికెన్ వలి, లక్ష్మన్న, శ్రీనివాసులు, విశ్వనాథ్, ఆనంద్, గోపీ, సుధాకర్‌రెడ్డి, ఈశ్వరయ్య, పోతన్న, గ్యాస్ సీనా, లక్ష్మీదేవమ్మ, ఆదెమ్మ, ఉషా, ఉమాపతి, మల్లన్న, నాగభూషణ, రవీంద్ర, గాలి నరసింహులు, విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి పివి.అనికేత్

ప్రజాశక్తి-ఉరవకొండ

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిసుంత్తన్న వైద్యాధికారి పివి.అనికేత్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి పివి.అనికేత్ సూచించారు. శుక్రవారం పి.కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పివి అనికేత్ ఆధ్వర్యంలో నింబగల్ గ్రామంలో కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఇంటి లోపల, బయట నీటి నిల్వలను గుర్తించి శుభ్రం చేసుకోవాలన్నారు. లేకుంటే దోమలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు లాంటి జబ్బులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. తద్వారా ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమేకాక మరణించే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రజలందరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలని, సాయంత్రం వేపాకు పొగ వేసుకోవడం ద్వారా దోమలు ఇంట్లో దోమలు ప్రవేశంచవన్నారు. ఏవైనా ప్రమాదకర లక్షణాలు ఉన్నట్టయితే వెంటనే ఆశా, ఎఎన్ఎంను సంప్రదించాలని వివరించారు. అలాగే గ్రామ ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఆరోగ్య సహాయకుడు ఎం.ప్రసాద్‌రావు, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ప్రీతి, ఏఎన్ఎం నాగమ్మ, అంగన్‌వాడీ ఈశ్వరీదేవి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్లూరు

ఎంఇఒ శ్రీదేవికి వినతిపత్రం సమర్పిస్తున్న సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులు

సమగ్ర శిక్షా, కెజిబివిల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు కోరారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న విజయవాడలోని ధర్నాచౌక్‌లో చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షకు వెళ్లేందుకు సామూహిక సెలవు ఇవ్వాలని ఉద్యోగులు స్థానిక ఎంఇఒ శ్రీదేవిని శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, పీఆర్సీ ప్రకారం ఎంటిఎస్, డిఎ, హెచ్ఆర్ఎ అమలు చేసి వేతనాలు పెంచాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మెడికల్ లీవులు, చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని, రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పార్ట్ టైం ఉద్యోగులను ఫుల్ టైంలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు డిప్యూటీ డిఇఒ అశ్వర్థ, ఎంఐఎస్ లక్ష్మీ, సిఆర్‌పిలు వీరయ్య, లాజరయ్య, నారాయణస్వామి, జయచంద్ర, ఐఇఆర్‌పి సుదర్శన్‌రెడ్డి, మెస్సెంజర్ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదం శుభపరిణామం

బుక్కరాయసముద్రం : పార్లమెంట్‌లో మహిళా బిల్లుకు ఆమోదం పొందడం శుభ పరిణామమని జనసేన పార్టీ మహిళా నాయకురాలు శశిరేఖ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు కల్పించే విధంగా నారీశక్తి వందన్ అధినయం బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఆమోదం పొందడం సంతోషకరమన్నారు. నూతన పార్లమెంట్ భవనంలో ఆమోదం పొందిన తొలి బిల్లు ఇదే కావడంతో నారీశక్తి వందన్ అధినయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆకాశంలో సగం అంటూ మహిళలను మెప్పించే మాటలకు పరిమితం కాకుండా వారి శక్తి సామర్థ్యాలను చట్టసభల్లో సముచిత స్థానం కల్పించేలా బిల్లును ప్రవేశపెట్టడం హర్షణీయమన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా గత ఎన్నికల్లోనే మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తామని మేనిఫెస్టో పేర్కొన్న విషయం తెలిసిందే అన్నారు. మహిళల పట్ల పవన్ కళ్యాణ్‌కు ఉన్న ఔదార్యానికి గర్విస్తూ 'నారీ శక్తి వందన్ అధినయం' మహిళా సాధికారతకు బాటలు వేస్తుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నామన్నారు.

ఎంసిఎ, ఎంబిఎ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన ఎంసిఎ, ఎంబిఎ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఇ.కేశవరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసిఎ 4వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, ఎంసీఏ 4వ, 5వ సెమిస్టర్స్ (ఆర్17) సప్లిమెంటరీ పలితాలు, ఎంబీఏ 4వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, ఎంబీఏ 4వ సెమిస్టర్ (ఆ417) సప్లిమెంటరీ పరీక్ష పలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘంలోని వివిధ సచివాలయాలు, ఎన్నికల వార్డుల్లో ఖాళీగా ఉన్న 16 వార్డు వాలంటీర్ పోస్టులకు అర్హులైన వారు ఈనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సంబంధిత వార్డు సచివాలయం, మున్సిపల్ కార్యాలయంలో సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

ఈక్రాప్‌లో సూపర్ చెక్ తనిఖీ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఎఒ పెన్నయ్య

2023 ఖరీఫ్ సీజన్ ఈక్రాప్ నమోదులో భాగంగా సూపర్ చెక్ తనిఖీ చేసినట్లు విడపనకల్లు మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య తెలిపారు. విడపనకల్లు మండలం అంచనహాళ్ గ్రామానికి చెందిన రైతు లోకనాథ్ పొలం సర్వే నంబర్ 76లో ఆరెకరాల కందిపంట, మరో మహిళా రైతు రాధమ్మ పొలం సర్వేనెంబర్ 75లో 8.25 ఎకరాల్లో సాగు చేసిన కందిపంట, అదే గ్రామానికి చెందిన రైతు పి.కిరణ్‌కుమార్ 4.25 ఎకరాల్లో సాగుచేసిన వేరుశనగ పంటను సూపర్ చెక్ చేశారు. మండల వ్యాప్తంగా ఇంకా ఎవరైనా ఈ క్రాప్ నమోదు చేసుకోకపోతే ఖచ్చితంగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రసాద్, వీఏఏ అశోక్‌కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిడిఒ రామచంద్ర సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామ సచివాలయన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు సక్రమంగా ఇంటింటికీ వెళ్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు పథకం పట్టిక విడుదల

ప్రజాశక్తి-రాయదుర్గం

స్థానిక ఆర్టీసీ డిపోలో నూతనంగా ఏర్పాటు చేసిన పొదుపు పథకం పట్టికను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ సభ్యులందరికీ ఈ పథకం చాలా ఉపయోగపడుతుందన్నారు. అందరూ ఈ పథకంలో చేరి రిటైర్డ్ అయ్యే సమయానికి లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు జిలాన్, స్వామి, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌కుమార్, దూద్ పీరా, అదనపు కార్యదర్శి రమేష్, జగదీష్, రెడ్డి, వలి, రామాంజనేయులు, రామాంజి, గోవిందు, రమణయ్య, జయప్రకాష్, విజయ్, మస్తాన్, రావు, వన్నూరుస్వామి, షేక్షావలి, హరినాథ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు పథకం పట్టిక పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్టీసీ అధికారులు

తాగునీటి పథకాల పనులను వేగవంతం చేయాలి

ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ జివి.రాజ్‌కుమార్

ప్రజాశక్తి-గుత్తి

మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ జివి.రాజ్‌కుమార్

ప్రజల అవసరాల దృష్ట్యా తాగునీటి పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జివి.రాజ్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ కార్యాలయంలో జలజీవన్ మిషన్ కింద మంజూరైన తాగునీటి పథకాలపై ఎన్ఎఆర్ సంస్థ ప్రతినిధులు, ఆర్‌డబ్ల్యుఎస్ గుత్తి,గుంతకల్లు, పామిడి, తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు,పెద్దవడుగూరు మండలాల అసిస్టెంట్ ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న జలజీవన్ మిషన్ పథకం సంబంధించి పైపులైన్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు పిఎం.మంజునాథ్, అశ్వినీకుమారి, ఎస్.బాలకృష్ణ, ఐజయ్య, ప్రసాద్‌రెడ్డి, మహేష్‌యాదవ్, దేవకుమార్, జెటిఓ మనోహర్, ఎన్ఎఆర్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనలో ప్రభుత్వాలు విఫలం

మాట్లాడుతున్న ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రమణారెడ్డి

గుత్తి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పరిపాలించడంలో పూర్తిగా విఫలమైందని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ చౌక్, రాజీవ్ గాంధీ సర్కిల్ వరకూ సాగింది. ఇందులో భాగంగా పట్టంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకటయ్య, నాయకులు టి.ఓబులేష్, లక్ష్మీనారాయణ, బి.శ్రీనివాస్ రాజు, బి వెంకట కొండయ్య విజయ్, ఎం.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన సీఎం

గుత్తి : సిఎం జగన్ ఎన్నికల సమయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రమణారెడ్డి విమర్శించారు. శుక్రవారం గుత్తిలో నిర్వహించిన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిపిఎస్ అమలు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఓపిఎస్ ను అమలు చేయాలని అన్నారు. 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఎపిజిపిఎల్ఐసి, రుణాలు, ఫైనల్ పేమెంట్లను తక్షణమే మంజూరు చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా కార్యదర్శి జి.ప్రసాద్, మండల కార్యదర్శి అసీఫ్, జిల్లా నాయకులు రమణయ్య, శివశంకర్, సురేష్ కుమార్, బసవరాజు, శంకరయ్య, సూర్యప్రకాష్‌రెడ్డి, ఓబులేసు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బ్లీచింగ్ చల్లుతున్న వైద్యసిబ్బంది

నార్పల : ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గొల్లపల్లి సర్పంచి రామాంజనేయులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సిద్ధరాచర్ల గ్రామ పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మురుగు నీరుఉండడం ద్వారా దోమలు, ఈగలు వ్యాప్తి చెందిన రోగాలు వస్తాయన్నారు. ఇందులో భాగంగా వీధుల్లోని మురుగునీరు, అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, క్లాప్‌మిత్ర దొడ్డి శంకర్, ఆశావర్కర్ అంజలి, తదితరులు పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతపురం కలెక్టరేట్ : విద్యా రంగ సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేద్దామని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉపాధ్యాయ భవన్‌లో ఏపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హజరైన రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టదాయకంగా ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కారక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులు సతీష్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, హనుమంతు, లక్ష్మీనారాయణ, ఓపన్న, ఎల్లప్ప, శ్రీనివాసులు, ఓబులేసు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-నార్పల

నార్పలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణకు చట్టభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయకపోతే బిజెపికి పతనం తప్పదని హెచ్చరించారు. కావున వెంటనే ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ హరికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రంగాపురం పుల్లప్ప, చిన్న ఆంజనేయులు, చంద్ర, హనుమంతు, పెద్ద గంగయ్య, ఎస్‌వి.రమణ, మేకల రాజు, సూర్యనారాయణ, బయన్న, రామాంజనేయులు, అనిల్, రవి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలని కోరుతూ మండలంలోని అప్పేచెర్ల సమీపంలో ఉన్న 67వ జాతీయ రహదారిపై దండోరా నాయకులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ముందుగా పెద్దవడుగూరులోని పేట శివాలయం నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అప్పేచెర్ల వద్ద ఉన్న జాతీయరహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకుడు కత్తుల కొండయ్య, మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు ఆదినారాయణ, నియోజకవర్గ నాయకుడు పెద్దిరాజు, మండల నాయకుడు భూపతి, రామాంజనేయులు, రంగస్వామి, పెద్దలయ్య, రంగప్ప, కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

కూలిన ఇంటి పైకప్పు

శింగనమల : మండల పరిధిలోని ఆనందరావుపేట గ్రామంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అప్ప జగన్నాథ్, కళావతి చెందిన ఇల్లు కూలిపోయింది. దీంతో ఇంట్లోని నిత్యావసర సరుకులు, వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఫలితంగా దాదాపు రూ.50వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.